‘తూర్పు’లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- సీఎం జగన్‌కు కానుకగా తూర్పు ఎమ్మెల్యే స్థానం
- ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ
- 12, 16 వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమావేశం



12వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న ఎంవీవీ



16వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేద్దామని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో 12వ వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బాటలు వేస్తాయన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. పథకాల లబ్ధిని, రాష్ట్ర అభివృద్ధికి జరుగుతున్న కృషిని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16వ వార్డు నాయకులతో..

లాసన్స్‌బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో 16వ వార్డు ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఎంపీ ఎంవీవీ మంగళవారం రాత్రి సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వార్డులోని పరిస్థితులతో పాటు సమస్యలు, అవసరాలపై స్థానిక నాయకులతో చర్చించారు. పలువురు నాయకులు ఆయా విషయాలను ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ 16వ వార్డు ఇన్‌చార్జి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, పార్టీ మహిళా అధ్యక్షురాలు కృపా జ్యోతి, వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ చైతన్యానికి కృషి అవసరం

- రెక్టార్ ఆచార్య కె.సమత
- ఏయూలో ఐడీఆర్‌సీ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంచే దిశగా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకళింపు చేసుకోవడం వంటి లక్షణాలను అధ్యాపకులు అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాది మంది ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునికి సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సినీనటుల సందడి



నటుడు శత్రు, నటి ప్రతీక్ష మిశ్రా

కొమ్మాది: ఆరిలోవలో మంగళవారం సినీనటులు సందడి చేశారు. ఇక్కడున్న ఓ ఆస్పత్రిలో జరిగిన సినిమా షూటింగ్‌లో నటి ప్రతీక్ష మిశ్రా, నటుడు శత్రు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శత్రు మాట్లాడుతూ తన సినీ కెరీర్‌లో రంగస్థలం, పుష్ప మంచి గుర్తింపునిచ్చాయన్నారు. ప్రస్తుతం ఓ సినిమాలో (పేరు ఖరారు కాలేదు) రెండో హీరోగా నటిస్తున్నట్లు ఆయన తెలిపారు. సినీనటులు రాకతో ఆస్పత్రి వాతావరణం అంతా సందడిగా మారింది.

నవంబర్ 5న ఆశ్రా జాతీయ సదస్సు

బీచ్ రోడ్డు: ఢిల్లీలో ఆశ్రా 5వ జాతీయ సదస్సు నవంబర్ 18న నిర్వహించనున్నట్టు ఆశ్రా ఫౌండర్ హబీబ్ సుల్తాన్ ఆలీ తెలిపారు. ఈ మేరకు సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం సిరిపురంలోని వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వినియోగదారునికి తమ హక్కులపై అవగాహన కలిగించి, మోసాల నుంచి బయట పడే అవకాశాన్ని ఆశ్రా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రా ప్రతినిధులు తనూజ రెడ్డి, వెంకటేశ్వరి, కె.రమణబాబు, విజయ దుర్గ, వీరుమామ పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు 157 సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన 11 పెన్షన్లను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దువ్వి గోవింద్, ప్రసాదుల హేమలత, బంధపు వెంకటేష్, ఎస్.పోలారావు, ఎస్.సురేష్, తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ కిల్లాన రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏకు గుర్తింపు జీవో



గుర్తింపు యూనియన్ జీవోను తీసుకుంటున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తింపు జీవో జారీ చేసిందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జీవోను మంగళవారం సచివాయలంలో జీఏడీ డిప్యూటీ సెక్రటరీ నాగమణి నుంచి స్వీకరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు వెలగక అవస్థలు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు కాగితాల వారి వీధి, కొత్తపేట ప్రాంతాలలో పలు వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. జీవీఎంసీకి, సచివాలయంలో సైతం ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరం స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కోసం వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఆ నిధులతో సచివాలయం పరిధిలోని రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలను నేరుగా ఇంటికి వెళ్లి అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రుల మార్గంలో అంధకారం



వీధిదీపాలు లేక చీకటిగా ఉన్న రహదారి

ఏయూ క్యాంపస్: మూడు ప్రధాన ఆస్పత్రులకు వెళ్లే రహదారిలో చీకటి పడితే అంధకారం రాజ్యమేలుతోంది. ఆ మార్గంలో ప్రయాణించాలంటే భయమేస్తోంది. పోలమాంబ ఆలయం నుంచి మానసిక ఆస్పత్రి కూడలి వరకు వెళ్లే మార్గం వీధి దీపాలు వెలగక అంధకారం తాండవిస్తోంది. నిత్యం వందలాది మంది ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. చినవాల్తేరుకు వెళ్లేవారు, బీచ్‌రోడ్డుకు వెళ్లేవారు సైతం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. ఆస్పత్రిలో ఉండే రోగుల బంధువులు, స్థానికులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడా మైదానానికి కంచె ఏర్పాటుకు సన్నాహాలు



కంచె ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు హెల్త్ సిటీని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడా మైదానంగా ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు రెండెకరాల విస్తీర్ణం గల ఈ ఖాళీ స్థలం చుట్టూ కంచె నిర్మించడానికి మంగళవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇక్కడ క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రస్తుతం రూ.50 లక్షలు నిధులతో జీవీఎంసీ దీనికి కంచె ఏర్పాటు చేసి మధ్యలో వాకింగ్ ట్రాక్, ఎర్త్ ఫిల్లింగ్ తదితర పనులు చేపడుతుందని తెలిపారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం



యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మద్దిలపాలెం: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను పాడు చేసుకోవద్దని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్–చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసి పరిచయం చేసుకోవాలన్నారు. అంతేకాని వారిని ర్యాగింగ్ చేయవద్దని సూచించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన శిక్షలున్నాయన్నారు. ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఏయూ లా కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్ మాట్లాడుతూ జూనియర్లు కూడా సీనియర్ల అంటే గౌరవ భావంతో మెలగాలన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల సైకియాట్రీ డాక్టర్ కె.మాధవి మాట్లాడుతూ ఎక్కువగా సీనియర్‌ల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ కళాశాల ర్యాగింగ్ నియంత్రించడానికి అత్యంత పటిష్టమైన చర్యలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి పది మందికి ఒక అధ్యాపకుడిని మెంటర్‌గా పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఉమామహేశ్వరరావు, పొలిటికల్ ధనలక్ష్మి అనురాధ, గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో గృహిణి ఆత్మహత్య

ఆరిలోవ: మనస్తాపంతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ మెహ్బా(36), ఆమె భర్త ఖాదర్ బాషా పదేళ్ల క్రితం విశాఖ వచ్చి జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు(పాప, బాబు). భార్యాభర్తలు ఇద్దరూ ఇంటికి దగ్గరలోనే చికెన్ పకోడీ బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజులుగా మెహ్బా అనారోగ్యం(తీవ్ర కడుపు నొప్పి)తో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం బాషా చిలకలూరిపేట వెళ్లాడు. తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తలుపులు లోపల నుంచి గడియ పెట్టడంతో పాటు ఎంత పిలిచినా మెహ్బా పలకలేదు. దీంతో స్థానికుల సహాయంతో బాషా తలుపులు తెరిచి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆమె కనిపించింది. పిల్లలిద్దరూ ఉదయం స్కూల్‌కు వెళ్లారు. ఆమె ఆత్మహత్య విషయాన్ని బాషా పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ సూర్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మధ్యాహ్నం ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భర్త బాషా ఇచ్చిన వివరాలను ఆరిలోవ ఎఐ సూర్యనారాయణ నమోదు చేశారు. చిలుకలూరిపేటలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు ఎస్‌ఐ సమాచారం ఇచ్చారు. వారు ఆరిలోవ వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

‘మట్టి వినాయక ప్రతిమలు పూజిద్దాం’



మట్టి వినాయక ప్రతిమలు ప్రదర్శిస్తున్న వీఎంసీ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం నినాదంతో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా గణపతి నవరాత్రులు నిర్వహించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో పాటు భార లోహాలు, విషతుల్య రసాయనాలను నవరాత్రి వేడుకలకు దూరంగా ఉంచి పర్యావరణానికి జరిగే హానిని నిరోధించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణహిత గణపతి నవరాత్రులు దిశగా పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయిస్తున్నట్లు వెల్లడించారు.

సేవ చేయాలనే భావన ఉండాలి

ఎంవీపీ కాలనీ: సమాజానికి సేవ చేయాలనే భావన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని భద్రకాళీ పీఠాధీశ్వరి సింధూ మాతాజీ అన్నారు. ఎంవీపీ కాలనీలో ఏర్పాటు చేసిన ఓ ట్రస్ట్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, నిరాశ్రయులకు చేయూతనివ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ దిశగా కొన్ని ట్రస్ట్‌లు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

రీసెర్చ్ ప్రాజెక్టు రిపోర్టుల విడుదల



ప్రాజెక్ట్ రిపోర్టులను విడుదల చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పరిశోధన ప్రాజెక్టుల రిపోర్టులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. యూజీసీ సహకారంతో 2022–23 మధ్య కాలంలో పరిశ్రమలు, రిటైల్ షాపుల్లో పని చేస్తున్న మహిళల ఆరోగ్య సమస్యలు, పట్టణ మురికివాడల్లో మహిళల ఆరోగ్య సమస్యలపై అధ్యయనం చేశారు. అదే విధంగా పని చేసే స్థలంలో లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహనకు నిర్వహించిన యాక్షన్ రీసెర్చ్ రిపోర్ట్‌లను వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.ఉష, సిబ్బంది డాక్టర్ టి.సాంబశివరావు, డాక్టర్ కె.రవి కుమార్, బి.జె.కిరణ్ ప్రసాద్, సిహెచ్.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌ను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



మ్యూజియం సందర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్‌ను మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్రావు సందర్శించారు. భవన్ కార్యక్రమ తీరును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవన్‌లో గల మ్యూజియం, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఇక్కడ కార్యాలయ సిబ్బందిని చిన్నబాబు పరిచయం చేశారు.

ఆచార్య వజీర్ మహ్మద్‌కు సత్కారం



వజీర్ మహ్మద్‌ని సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్‌ని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన ఏయూ స్నాతకోత్సవంలో బెస్ట్ రీసెర్చర్ పురస్కారాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని విభాగ ఆచార్యులు, విద్యార్థులు వజీర్ మహ్మద్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కత్తితో కోడలిపై మామ దాడి

అదనపు కట్నం కోసం వేధింపులు



గాయపడిన హారిక

బీచ్‌రోడ్డు : బీచ్‌రోడ్డు : కోడలిపై మామ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుల్లయ్య కాలేజీ సమీపంలో నివాసముంటున్న బొట్టా అప్పారావు.. తన కుమారుడు మధుసూదనరావుకు పదేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన హారికతో పెళ్లి చేశాడు. ఆ సమయంలో ఇచ్చిన లాంఛనాలు కాకుండా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం అడగడంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయంలో కుమారుడు మధుసూదనరావు కూడా భార్య కుటుంబానికి సహకరించటంతో అప్పారావు తట్టుకోలేకపోయాడు. దీంతో కొడుకు, కోడలిని ఇబ్బంది పెట్టడం ప్రారంభించారు. మూడో అంతస్తులో నివాసం ఉంటున్న తన కుమారుడు ఇంటికి నీటి సదుపాయం నిలిపివేశాడు. దీంతో కోడలు నీటి కోసం సోమవారం దిగువ ఫ్లోర్‌కు రావడంతో చూసి సహించలేని అప్పారావు కత్తితో దాడి చేశాడు. ఆమె తప్పించుకోవడంతో భుజానికి గాయమైంది. విషయం గమనించిన చుట్టు పక్కల వాళ్లు అప్పారావును అడ్డుకొన్నారు. అనంతరం హారికను కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంగనీసు లీజు గడువు పెంపునకు సహకరించండి



ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న గర్భాం మాంగనీసు లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షులు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ కోరారు. విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు 40 ఏళ్ల క్రితం విజయనగరం జిల్లా గర్భాం గ్రామ పరిధిలో మాంగనీజు గనులు కేటాయించారన్నారు. దాని గడువు గత ఏడాది అక్టోబర్ 7వ తేదీతో ముగిసిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంకో పది సంవత్సరాలు లీజు గడువు పెంపు కావాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకుందన్నారు. దురదృష్టవశాత్తు లీజు గడువు ఫైలు మైనింగ్ మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందించి వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనతోనే ప్లాస్టిక్ నియంత్రణ



ప్లాస్టిక్ నిర్మూలనపై వినూత్న ప్రచారం చేస్తున్న కళాకారులు (ఫైల్)

దాబాగార్డెన్స్: ఎంత గొప్ప విషయమైనా మామూలుగా చెప్పే దాని కన్నా.. దృశ్య రూపంగా చెబితే చక్కటి ఫలితం ఉంటుంది. నాటకం, సినిమా, బుర్రకథ వంటి కళారూపాల ద్వారా సామాన్యులకు ఏదైనా చెబితే అది ఇట్టే గుర్తుండిపోతోంది. గతంలో ప్రభుత్వం సీజనల్ వ్యాధులపై ఇలాగే కళాజాతాలు నిర్వహించేది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో మళ్లీ అలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు అనారోగ్యం తప్పదు. పిల్లలకు ఈ సమస్యలు మరీ అధికం. పైగా జీవన ప్రమాణాలు కనిష్ట స్థాయిలో ఉండే చోట ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటుందనడంలో సందేహం లేదు. ఇలాంటి వ్యాధుల గురించి సామాన్యులు, పెద్దగా చదువుకోని ప్రజలకు అవగాహన అంతంత మాత్రమే. ఈ పరిస్థితుల్లో సంక్రమించే వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నది మనకు అవగతమే. అలా అని వారికి వ్యాధుల గురించి పాఠంలా వివరిస్తే ఫలితం ఉండదు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్థానికులకు వినోదాన్ని కలిగిస్తూనే అవగాహన పెంచే కళారూపాలను ఊరూరా పంపి, కార్యక్రమాలు నిర్వహింపజేసేది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధులపై ప్రతి ఏటా వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పించేది. దక్షిణ నియోజకవర్గంలోని పాతపోస్టాఫీస్, అల్లిపురం భీం నగర్, ప్రసాద్‌గార్డెన్స్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయా సెంటర్ల ఏఎన్‌ఎంలు, ఆయాల సహకారంతో సదస్సులు నిర్వహించేవారు. సదస్సులతో పాటు మురికివాడల్లోని ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు బుర్రకథల రూపంలో కళాకారులు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను పాట మాదిరిగానో, కథలాగానో చెప్పేవారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లల్లో ఐదు రకాల వ్యాధులను నియంత్రించే పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఉపయోగాలను సరదాగా వివరించేవారు. అన్నీ కథల్లా ఉండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. కొంత వరకైనా అవగాహనకు వచ్చేవారు. పేదసాద ప్రజలకు సీజనల్‌గా వస్తున్న వ్యాధుల గురించి అవగాహన కలిగించటం, ముందస్తు నివారణ పద్ధతులను విశదీకరించటంపై మళ్లీ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనం జ్వరాలతో మంచం పడుతున్నారు. మురికివాడలతో పాటు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత లేకపోవడంతోనే వ్యాధులు వ్యాపిస్తాయన్న విషయాన్ని ప్రజలకు చెప్పడం ఎంతైనా అవసరం. దీనికి బుర్రకథ, వీధి నాటకాల ప్రక్రియను మళ్లీ ప్రారంభిస్తే ఫలితం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.